
సాక్షి గుంటూరు

గురువారం । 26 । అక్టోబర్ । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 525.30 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



చెరువులకు జలకళ

దాచేపల్లి : తాగునీటి చెరువులు జలకళ సంతరించుకున్నాయి. ముత్యాలంపాడు, సారంగపల్లి అగ్రహారం చెరువులకు తంగెడ మేజర్ కాలువల ద్వారా నీటిని విడుదల చేశారు.



కార్తికేయునికి వెండి ఊయల

మోపిదేవి: శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి భక్తులు 2.30 కిలోల వెండి ఊయల సహా రూ.2.24 లక్షల విలువగల వెండి వస్తువులు సమర్పించుకున్నారు.

సామాజిక విప్లవ భేరి

- నేడు తెనాలిలో వైఎస్సార్ సీపీ 'సామాజిక సాధికారత' బస్సు యాత్ర ప్రారంభం
- అట్టడుగు వర్గాలకు చేకూరిన మేలు, సంక్షేమాభివృద్ధిని వివరించనున్న నేతలు
- తెనాలిలో బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి



తెనాలిలోని బహిరంగ సభ జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే శివకుమార్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సామాజిక విప్లవానికి చిరునామాగా మారింది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల జీవితాలలో కొత్త వెలుగు వచ్చింది. ఆయా వర్గాలు సామాజికంగా ముందుకు వెళ్లడమే కాకుండా రాజకీయ, ఆర్థిక రంగాలలోనూ ముందంజ వేశాయి. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా వర్గాల ప్రజల గుండెల్లో కొలువై ఉన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన 53 నెలల కాలంలో ఆయా వర్గాలకు ఏం మేలు చేసింది వివరించడానికి వైఎస్సార్ సీపీ 'సామాజిక సాధికారత యాత్ర' పేరుతో బస్ యాత్రను గురువారం నుంచి ప్రారంభించనుంది. దీనిలో భాగంగా మొదటి రోజున గుంటూరు జిల్లా తెనాలిలో ఈ కార్యక్రమం జరగనుంది.

సంక్షేమ పథకాలతో ఆర్థిక సాధికారత

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంక్షేమ పథకాలతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలిచింది. అమ్మఒడి, విద్యాదీవెన వంటి పథకాలతో విద్యా సాధికారతను సాకారం చేసింది. నామినేటెడ్ నుంచి క్యాబినెట్ వరకూ సింహభాగం పదవులు అట్టడుగువర్గాలకు ఇచ్చి పరిపాలనలో వారిని భాగస్వాములను చేసింది. సంక్షేమ పథకాల నుంచి పదవుల వరకూ మహిళలకూ పెద్ద పీట వేసింది. ఒక్క పైసా అవినీతికి తావు లేకుండా కోట్లాది రూపాయలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. ఇందులో 75 శాతం నిధులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేరాయి. మనబడి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సర్కారు అభివృద్ధి చేసింది. ఇంగ్లిషు మీడియం ప్రవేశ పెట్టడం ద్వారా పేద పిల్లలు అంతర్జాతీయ యవనికపై సగర్వంగా కాలర్ ఎగరేసేలా చేసింది.

జిల్లాలో పదవుల కేటాయింపులో పెద్దపీట

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ముగ్గురికి మంత్రి పదవులు ఇస్తే అందులో ఒకరు బీసీ మహిళ, ఒక ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఉన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఎస్సీ మహిళకు వైఎస్సార్ సీపీ పట్టం కట్టింది. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారికి రిజర్వేషన్ చేస్తూ చట్టం చేసి మరీ ఆ వర్గాలకు పదవులిచ్చింది. ఇటీవల ముగ్గురికి ఎమ్మెల్సీ పదవులు ఇస్తే అందులో ఇద్దరు బీసీలే. గుంటూరు జిల్లా నుంచి మాజీ పోలీసు అధికారి, గుంటూరు మిర్చియార్డ్ చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, బాపట్ల నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు పోతుల సునీతకు అవకాశం దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవులలో జిల్లా వాసులకు 9 నామినేటెడ్ పదవులు దక్కాయి. అందులో ఆరు (67 శాతం) పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు దక్కాయి. ఇతర కులాలకు మూడు పదవులు దక్కాయి. మొత్తం తొమ్మిదిలో నాలుగు మహిళలకే దక్కాయి. ముతాంజ్ పఠాన్‌కు స్టేట్ హ్యాండీక్యాప్ అండ్ సీనియర్ సిటిజన్ కార్పొరేషన్ పదవి, షేక్ ఆషా బేగంకు రాష్ట్ర షేక్ కార్పొరేషన్ పదవి, కుర్రా నాగ మల్లేశ్వరికి చరిత్ర అకాడమీ చైర్‌పర్సన్, వై.భాగ్యలక్ష్మికి డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పదవి వరించాయి. ఇందులో గుంటూరు నగరానికి చెందిన ముంతాజ్ పఠాన్ వార్డు వలంటీర్‌గా పనిచేస్తుండటం విశేషం. బీసీ కులాల కార్పొరేషన్ పదవులలోనూ రెండు మహిళలకు కేటాయించారు. కోలా భవానికి కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్‌పర్సన్, దేవళ్ల రేవతికి వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవులు దక్కాయి.

ఏర్పాట్ల పరిశీలన

రాష్ట్రంతోపాటు జిల్లాలోని తెనాలి నియోజకవర్గంలో గురువారం నుంచి యాత్ర ప్రారంభం కానుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిన ప్రయోజనాలను ఈ యాత్ర ద్వారా ఆయా వర్గాలకు చెందిన మంత్రులు, వైఎస్సార్ సీపీ నేతలు ప్రజలకు వివరిస్తారు. తెనాలిలో బస్సు యాత్ర ఏర్పాట్లను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తోపాటు వైఎస్సార్ సీపీ ప్రాంతీయ సమన్వయకర్త మర్రి రాజశేఖర్ బుధవారం పరిశీలించారు.

దేశంలోనే ఆదర్శ ప్రభుత్వం : ఎమ్మెల్సీ మర్రి

తెనాలిఅర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్ సీపీ గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికారత బస్సుయాత్ర బహిరంగ సభ జరిగే తెనాలి మార్కెట్ ప్రాంతాన్ని బుధవారం సాయంత్రం ఆయన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో కలిసి పరిశీలించారు. బస్సు యాత్ర రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ రాజశేఖర్ మాట్లాడుతూ ఇది ప్రజా ప్రభుత్వమని చెప్పారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ బస్సు యాత్రలో ప్రజల నుంచి వినతులు తీసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్లు మద్దాళి శేషచలం, షేక్ దుబాయ్ బాబు, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు బూరెల దుర్గ, కఠెవరపు దేవానంద్, బొమ్ము నాగిరెడ్డి, అత్తోట చంటి, అక్కిదాసు కిరణ్ కుమార్, గుంటూరు కృష్ణ, కుక్కల ముక్తేశ్వరరావు, తాడిబోయిన రమేష్, మట్లపూడి రాజేశ్వరరావు, కిట్టు, కఠారి హరీష్, చుండూరు సాయి, మేకల రవి, కనపర్తి అబ్రహం లింకన్, పెచ్చింగ్ సుభాని పాల్గొన్నారు.

యాత్రను జయప్రదం చేద్దాం : మాణిక్యవరప్రసాద్



పట్నంబజారు: వైఎస్సార్ సీపీ సామాజిక సాధికారత బస్సు యాత్రను జయప్రదం చేద్దామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ పిలుపునిచ్చారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బస్సు యాత్ర గురువారం నుంచి తెనాలి నియోజకవర్గంలో ప్రారంభమవుతున్న నేపథ్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలి రావాలని కోరారు. తెనాలి నియోజకవర్గం కొలకలూరు గ్రామంలో యాత్ర ప్రారంభమై సాయంత్రం 5.30 గంటలకు తెనాలి చేరుకుంటుందని, అక్కడ అన్నాబత్తుని సత్యనారాయణ పురవేదిక వద్ద భారీ బహిరంగ సభ జరుగుతుందని వివరించారు.

బస్సు యాత్ర సాగుతుందిలా..



తెనాలిఅర్బన్: బస్సు యాత్ర రూట్ మ్యాప్‌ను తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రకటించారు.

- మధ్యాహ్నం 3 గంటలకు తెనాలి మండలం కొలకలూరు బాపయ్యపేటలో బస్సు యాత్ర ప్రారంభం.
- 3.10 గంటలకు కుమ్మరి, శాలివాహనులతో ముఖాముఖి.
- 3.20 గంటలకు కొలకలూరు మెయిన్ సెంటర్‌లో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి, బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద నివాళి.
- 3.50 గంటలకు నంది వెలుగులోని కిసాన్ బజారులో రైతులతో ముఖాముఖి.
- 4.25 గంటలకు కంచర్ల పాలెం క్రాస్ రోడ్డుకు యాత్ర.
- 4.35 గంటలకు ఆటోనగర్‌కు..
- 4.40 గంటలకు సోమసుందరపాలెం గ్రామం వద్దకు..
- 4.50 గంటలకు కఠెవరం
- 5.05 గంటలకు తెనాలి వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కాలేజ్ వద్దకు బస్సు యాత్ర.
- 5.20 గంటలకు మార్కెట్‌లోని అన్నాబత్తుని సత్యనారాయణ పురవేదిక వద్దకు యాత్ర
- 5.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు బహిరంగ సభ.
- బస్సు యాత్రలో ముఖ్యఅతిథులుగా డెప్యూటీ సీఎం షేక్ అంజాద్ బాషా, మంత్రులు ఆదిమూలపు సురేష్, డాక్టర్ మేరుగ నాగార్జున, జోగి రమేష్, మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారుడు, సినీనటుడు ఆలీ, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవరప్రసాద్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పాల్గొననున్నారు.

న్యూస్‌రీల్

అమరావతిలో ముగిసిన దసరా ఉత్సవాలు



అమరావతి: బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీదేవీ శరన్నవ రాత్రోత్సవాలు బుధవారం పూర్ణాహుతితో ముగిశాయి. తొలుత చండీదేవి సమేత అమరేశ్వరస్వామికి నంది మండపంలో చూర్ణోత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు తిరువంజనం చేసి నూతన వస్త్రాలంకరణతో వసంతోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ మాట్లాడుతూ దసరా ఉత్సవాలలో చండీకల్యాణం అనంతరం స్వామికి చూర్ణోత్సవం, వసంతోత్సవం నిర్వహించటం ఆనవాయితీగా వస్తోందన్నారు. పూర్ణాహుతి కార్యక్రమం, పంచాహ్నిక దీక్షతో దసరా ఉత్సవాలు ముగిశాయని పేర్కొన్నారు. రాత్రి 10 గంటలకు నిర్వహించే ధ్వజావరోహణ కార్యక్రమంతో స్వామి ఏకాంతసేవా మహోత్సవాలు ప్రారంభమవుతాయని వివరించారు. వసంతోత్సవం అనంతరం స్వామికి పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ ఈఓ వేమూరి గోపీనాథశర్మ పాల్గొన్నారు.


26 నుంచి నవంబర్ 2 వరకు రైళ్లు ఆగవు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): నరసరావుపేట రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న డబ్లింగ్ పనుల నేపథ్యంలో ఆ స్టేషన్‌లో ఈనెల 26వ తేదీ నుంచి నవంబర్ 2 వరకు రైళ్లు ఆగవని గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్ కుమార్ బుధవారం తెలిపారు. గుంటూరు డివిజన్ పరిధిలోని సాతులూరు–నరసరావుపేట–మునుమాక స్టేషన్ల మధ్య డబ్లింగ్ పనుల్లో భాగంగా ప్రీ ఎన్ఐ, నాన్ ఇంటర్ లాకింగ్ బ్లాక్ పనులు జరుగుతున్నాయని వివరించారు. రైలు ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

రేపు నిధి ఆప్‌కే నికత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీఎఫ్ పరిధిలోకి వచ్చే యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లు ఈనెల 27న ఉదయం 9.30 గంటలకు ఆయా జిల్లాల్లో నిర్వహిస్తున్న నిధి ఆప్‌కే నికత్‌లో పాల్గొని తమ సమస్యలు, ఫిర్యాదులను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గుంటూరు జిల్లా పరిధిలో ప్రత్తిపాడురోడ్డులోని మలినేని ఇంజినీరింగ్ కళాశాల, కృష్ణాజిల్లా బాపులపాడులోని దీపక్ నెక్స్‌జెన్, ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలోని కృష్ణవేణి స్కూల్, ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని వర్సిటీ ఎడ్యుకేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సొసైటీ, ఇబ్రహీంపట్నంలోని ఫ్యాబెక్స్ స్టీల్ స్ట్రక్చర్స్ ప్రైవేటు లిమిటెడ్, బాపట్ల జిల్లా చీరాలలోని కోరమాండల్ ఆగ్రో ప్రొడక్ట్స్ అండ్ ఆయిల్స్, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పెదగార్లపూడిలోని చెట్టినాడ్ సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేటు లిమిటెడ్‌లో సమావేశాలు జరుగుతాయని వివరించారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 4,012 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 186, బ్యాంక్ కెనాల్‌కు 1,076, తూర్పు కెనాల్‌కు 253, పశ్చిమ కెనాల్‌కు 140, నిజాంపట్నం కాలువకు 260, కొమ్మమూరు కాల్వకు 1,410 క్యూసెక్కులు విడుదల చేశారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్; గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌లో బుధవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.2,800, గరిష్ట ధర రూ.4,000, మోడల్ ధర రూ.3,300 వరకు పలికింది.

ఆరోగ్య సురక్ష.. రక్షితః





చిలకలూరిపేట సుగాలీ కాలనీలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పరిశీలించారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. శిబిరానికి వచ్చిన ప్రజలను ఆత్మీయంగా పలకరించారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఎలాంటి రుగ్మత ఉన్నా.. మెరుగైన చికిత్సకు సిఫార్సు చేయాలని సూచించారు. అలాగే గుంటూరు ఐపీడీ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద జరిగిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. వైద్యసేవలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. రోగులతో మాట్లాడారు. – గుంటూరు వెస్ట్/చిలకలూరిపేట

రేపు ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ శుక్రవారం జరుగుతుందని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ముసాయిదా ప్రచురణ తర్వాత ఈ నెల 27 నుంచి వచ్చే డిసెంబర్ 12 వరకు దీనిపై క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. నవంబర్ 4, 5 తేదీలతోపాటు డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక శిబిరాల్లో అభ్యంతరాలను స్వీకరిస్తామని చెప్పారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, డెప్యూటీ కలెక్టర్ లలిత, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

కారు ఢీకొని ఇద్దరు మృతి



ఘటనాస్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రొంపిచర్ల : వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు దాటుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందిన ఘటన మండలంలోని సంతగుడిపాడు సమీపంలోని హైవేపై బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం నరసరావుపేట మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన కేతి కొండలు(62), ఈపూరు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన కేతి వెంకటేశ్వర్లు (28) నకరికల్లు నుంచి ముప్పాళ్ల గ్రామానికి వెళ్ళేందుకు ద్విచక్రవాహనంపై బయలు దేరారు. సంతగుడిపాడు గ్రామ సమీపంలోని మేజర్ కాలువ వద్దకు రాగానే కర్లకుంట మీదుగా ముప్పాళ్ల వెళ్లేందుకు హైవే రోడ్డు దాటుతుండగా.. అదే సమయంలో నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట నుంచి హైదరాబాద్ వైపునకు వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ద్విచక్రవాహనాన్ని నడుపుతున్న కొండలుకు, వెనుక కూర్చొన్న వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలయ్యాయి. వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. కొండలును నరసరావుపేటలోని ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. ఘటనలో కారు రోడ్డు పక్కన బోల్తా పడింది. కారులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కె.పి.రవీంద్ర ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తీసుకెళ్లారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

ఇండో–ఇజ్రాయెల్ ప్రాజెక్ట్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- నకరికల్లు మండలం గుండ్లపల్లిలో 25.57ఎకరాల్లో నిర్మాణం
- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వెల్లడి



నరసరావుపేట: సాగులో సరికొత్త విధానాలు, సాంకేతికతను రైతులకు అందించేందుకు మనదేశం, ఇజ్రాయెల్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం.. పల్నాడు జిల్లాలోని నకరికల్లు మండలం గుండ్లపల్లిలో బృహత్తర ప్రాజెక్టు ఏర్పాటుకు సంబంధించిన పూర్తిస్థాయి ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం బుధవారం జారీ చేసిందని పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. వ్యవసాయ ఆధారిత పల్నాడులో రైతులకు మంచి రోజులు వచ్చాయని వివరించారు. ప్రాజెక్ట్ గురించి బుధవారం ఎంపీ వివరాలు వెల్లడించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో అత్యాధునిక సదుపాయాలతో 25.57 ఎకరాల్లో ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందన్నారు. దీని ద్వారా మిరప, కూరగాయల సాగుకు సంబంధించిన విధానాలు రైతులకు అందుతాయని చెప్పారు. తక్కువ నీటి లభ్యత, తక్కువ రసాయనాలు వాడి అధిక దిగుబడులు ఎలా పొందవచ్చు, నూతన వంగడాలు, తయారు చేసే సాంకేతికతలు, వ్యవసాయ మెలకువలు ఈ ప్రాజెక్టులోని ల్యాబ్‌లు, పరికరాల ద్వారా సమకూరతాయని ఎంపీ వివరించారు. మిరప, టమాట, చెర్రీ టమాట, దోసకాయ, వంకాయ, క్యాప్సికమ్, ఇతర కూరగాయలు సాగు చేసే విధానాలు రైతులకు అందేలా కేంద్రం ఉత్తర్వులు ఇచ్చినట్లు ఎంపీ వెల్లడించారు. ప్రాజెక్టులో భాగంగా నర్సరీల పెంపకం కోసం ఫ్యాన్లు, ప్యాడ్ వ్యవస్థతో కూడిన గ్రీన్ హౌస్, హై టన్నెల్, వెంటిలేటెడ్ గ్రీన్‌హౌస్‌లు, ప్రీ కూలింగ్ చాంబర్‌లు, సహజ వెంటిలేటెడ్ గ్రీన్‌హౌస్‌లు నిర్మిస్తారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

తెలియకుండా విదేశాలకు భార్య! భర్త ఆత్మహత్య


మృతుడు ఆలూరి సార్వభౌమ (ఫైల్)

కొల్లూరు: భార్య, భర్తల నడుమ స్వల్ప వివాదాలు జరుగుతున్న నేపథ్యంలో భర్తకు తెలియకుండా భార్య విదేశానికి వెళ్లిపోవడంతో మనస్థాపానికి గురైన భర్త ఉరి పెట్టుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఈపూరుకు చెందిన ఆలూరి సార్వభౌమ (31)కు మూడేళ్ల క్రితం చెరుకుపల్లి మండలం గూడవల్లికి చెందిన పూర్ణిమ అనే యువతితో వివాహం జరిగింది. హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటూ జీవిస్తున్న దంపతుల నడుమ గత కొద్ది నెలలుగా మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. అప్పట్నుంచి సార్వభౌమ ఈపూరులో తన గృహ నిర్మాణ పనులు చూసుకుంటూ ఇంటి వద్ద నుంచే ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. పెద్దలు ఇరువురి నడుమ సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. అయితే ఇటీవల తన భార్య ఫోన్‌లలో సైతం స్పందించక పోవడంతో ఆమె సమాచారం తెలుసుకునేందుకు తన అత్తగారి ఇంటికి మృతుడు వెళ్లగా సరైన సమాధానం లభించలేదు. ఇటీవల తన భార్య తనకు చెప్పకుండా లండన్ వెళ్లినట్లు తెలుసుకున్న సార్వభౌమ మనస్థాపంతో బాధపడ్డాడు. బుధవారం తెల్లవారుజామును అతని తల్లి నిద్రలేచి రోజువారి పనులు చేసుకునేందుకు బయటకు వచ్చిన క్రమంలో డాబా మెట్ల వద్ద ఉన్న సిమెంట్ పిల్లరుకు ఉరి పెట్టుకుని వేలాడుతూ ఉండటం గమనించి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఉరి నుంచి తప్పించి, పరీక్షించగా అప్పటికే మృతి చెందాడు.

మృతుడి తల్లి తన కోడలు కారణంగానే తన కుమారుడు మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరపనున్నట్లు ఎస్‌ఐ జి.రాజ్యలక్ష్మి తెలిపారు. మృతదేహాన్ని వేమూరు సీఐ వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఐ రామయ్యలు పరిశీలించి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సచివాలయ వ్యవస్థతోనే గ్రామస్వరాజ్యం

- ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య
- అనుమర్లపూడిలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లకు ప్రారంభోత్సవాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య


సచివాలయాన్ని ఆరంభిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

పెదకాకాని: జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో సాధ్యమైందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. మండలంలోని అనుమర్లపూడి గ్రామంలో 89.34 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లకు బుధవారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ఎంపీపీ తుల్లిమల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ గ్రామ ప్రజలు తమకు అవసరమైన సేవలు గ్రామంలోనే సచివాలయం ద్వారా పొందాలనే గొప్ప ఆశయంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. గతంలో రెవెన్యూ సేవల కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి, తహసీల్దార్ కార్యాలయానికి తిరిగే పరిస్థితి నెలకొని ఉందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాల ద్వారా గ్రామ ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలు గ్రామంలోనే అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రజలు సచివాలయ, రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. అమలు కాని హామీలతో గద్దెనెక్కిన గత ముఖ్యమంత్రి 14 సంవత్సరాలు సీఎం అని చెప్పుకుంటూ కుంభకోణాలు చేసి జైలులో గడుపుతున్నారన్నారని ఆరోపించారు. 14.84 కోట్లతో అనుమర్లపూడి, తంగెళ్ళమూడి గ్రామాల్లో జరిగిన రోడ్లు, సీసీ డ్రైన్‌లు, అభివృద్ధి పనులను వివరించారు.

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ పరిపాలన వ్యవస్థను గ్రామస్థాయిలో అందుబాటులోకి తీసుకు వచ్చి ప్రజలకు ప్రభుత్వ సేవలను ఇంటి ముంగిటకు వేగవంతంగా, పారదర్శకంగా అందించడంతో పాటు మౌలిక సౌకర్యాల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దానబోయిన సుభాషిణి, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, సర్పంచులు జిల్లెళ్ళ కిషోర్ (తంగెళ్ళమూడి), గోళ్ళ స్వరూప రాణి (పెదకాకాని), సూపరిండెంట్ బి.వి. మల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు షేక్ షహనాజ్, మాతంగి నిర్మల, బంగారు మరియమ్మ, దంతాల శివపార్వతి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్ హుస్సేన్, మాదా రాధాకృష్ణ మూర్తి, మాజీ సర్పంచులు బద్దెపూడి రమేష్, దానబోయిన పాములు, మండల కన్వీనర్ చాగంటి మురళీమోహన్ రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుబాని, శివాలయం ట్రస్టుబోర్డు చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పీఆర్ ఏఈ జగదీష్, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ పాలకవర్గం సభ్యులు, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు పది ప్రాంతాల్లో సురక్ష వైద్య శిబిరాలు

నరసరావుపేట: జిల్లాలోని పది ప్రదేశాల్లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి బుధవారం పేర్కొన్నారు. అచ్చంపేట మండలం తాడువాయి గ్రామం, బొల్లాపల్లి మండలం రావులపురం, గురజాల మండలం చర్లగుడిపాడు, మాచర్ల మండలం విజయపురిసౌత్, నాదెండ్ల మండలం సాతులూరు, నరసరావుపేట మండలం కేసానుపల్లి, పిడుగురాళ్ల మండలం జానపాడు, వెల్దుర్తి మండలం గంగలకుంట, చిలకలూరిపేట పట్టణంలోని సుబ్బయ్యతోట యూపీహెచ్‌సీ, నరసరావుపేట పట్టణం బరంపేట యూపీహెచ్‌సీలో నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ కోరారు.

ఎయిమ్స్‌లో కార్డియాక్ విభాగం

మంగళగిరి: నగరంలోని ఆల్ ఇండియా మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్)లో అన్ని రకాల జబ్బులకు వైద్యం అందుబాటులోకి వచ్చింది. ఇప్పటి వరకు అన్ని రకాల వ్యాధులకు చికిత్స లభిస్తున్నా గుండెజబ్బులకు సంబంధించి విభాగం లేకపోవడంతో గుండెజబ్బులకు పూర్తి స్థాయిలో చికిత్స అందించలేకపోకపోతున్నారు. బుధవారం నుంచి గుండె జబ్బులకు ఎయిమ్స్‌లో చికిత్స అందించనున్నట్లు అందుకొరకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసినట్లు ఎయిమ్స్ డైరెక్టర్ ముఖేష్ త్రిపాఠి తెలిపారు. దీంతో ఎయిమ్స్‌లో అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, ఔట్ పేషంట్, ఇన్ పేషంట్‌లు అందరికి 24 గంటలు చికిత్స అందుబాటులోకి రావడం జరిగిందన్నారు. రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు వైద్యులతో పాటు సిబ్బందిని నియమించడం జరిగిందని వివరించారు. ఎయిమ్స్ వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలతో పాటు చికిత్స అందించడం జరుగుతుందని చెప్పారు. మందులు అతి తక్కువ ధరలకే అందిస్తున్నామని ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రోజు మూడు వేల మందికిపైగా రోగులు వస్తున్నారన్నారు.

యార్డుకు 14,283 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 14,283 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 13,526 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.11,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 24,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.12,000 నుంచి రూ.21,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.14,000 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 7,797 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఐఈఆర్పీ పోస్టులకు ఇంటర్వ్యూలు

గుంటూరు వెస్ట్: ఉమ్మడి గుంటూరు జిల్లా భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 15 ఎంఆర్ కేటగిరికి చెందిన ఐఈఆర్పీ పోస్టులకు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఇంటర్వ్యూ నిర్వహించారు. మొత్తం 35 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. పాల్గొన్న వారందనీ జేసీతోపాటు జిల్లా అధికారులు ఇంటర్వ్యూ చేశారు.

28న అండర్-17 క్రికెట్ జట్ల ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరుజిల్లా అండర్–17 బాలబాలికల క్రికెట్ జట్ల ఎంపిక పోటీలను ఈనెల 28వ తేదీ శనివారం నరసరావుపేటలోని డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. క్రీడాకారులు 2007 జనవరి 1వతేదీ తరువాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. కేంద్రీయ విద్యాలయం, సీబీఎస్ఈ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ పాఠశాల నుంచి ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో మాత్రమే పాల్గొంటామనే అంగీకార పత్రం తీసుకరావాలని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తప్పనిసరిగా అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో రిజిస్టర్ చేసుకొని 28వతేదీ ఉదయం 9గంటలకు హాజరు కావాలని తెలిపారు.

నేటి నుంచి ఈ–క్రాప్ ముసాయిదా జాబితాల ప్రదర్శన

నరసరావుపేట: జిల్లాలోని అన్నీ ఆర్‌బీకేలలో ఈనెల 26వ తేదీ నుంచి 29వరకు నాలుగురోజుల పాటు సామాజిక తనిఖీ కోసం ఈ–క్రాప్ ముసాయిదా జాబితాను ప్రదర్శించటం జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి బుధవారం వెల్లడించారు. ఖరీఫ్–2023లో 3,75,649 ఎకరాల్లో పంటసాగుపై ఈ–క్రాప్ పూర్తిచేయటం జరిగిందన్నారు. నాలుగురోజుల్లో గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ముసాయిదా జాబితాలోని రైతుల వివరాలను ఆర్‌బీకే సిబ్బంది చదివి వినిపిస్తారన్నారు. రైతులు ముసాయిదా జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఏమైనా ఉంటే సవరణ కోసం ఆర్‌బీకే కేంద్రాల్లోని వీఏఏ, వీహెచ్‌ఏ, వీఎస్‌ఏలను సంప్రదించి అభ్యంతరాలను రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇదే ఆఖరి అవకాశమని, తుది జాబితా ప్రదర్శన తర్వాత ఎటువంటి మార్పులు, చేర్పులు ఉండజాలవని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా చంద్రమౌళీశ్వరస్వామి తెప్పోత్సవం


నర్సింగపాడులో మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి వారి తెప్పోత్సవం

వేలాదిగా పాల్గొన్న భక్తజనం

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడులో వేంచేసి ఉన్న గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వర స్వామి వారి ఆలయ కోనేటిలో స్వామి వారి తెప్పోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధప్రాంతాల నుంచి తెప్పించిన పలు రకాలపూలతో అలంకరించిన హంస వాహనంపై కోనేటిలో స్వామివారు విహరిస్తుండగా శివనామస్మరణతో భక్తులు మైమరిచిపోయారు. పలు గ్రామాల నుంచి తెప్పోత్సవం తిలకించేందుకు వచ్చిన భక్తజనంతో ఆలయం, కోనేటి ప్రాంగణం కిక్కిరిసింది. దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం స్వామివారి తెప్పోత్సవం మేళతాళాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానఅర్చకుడు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశేషపూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వామివారు హంసవాహనంపై కొలువు దీరగా కోనేటిలో భక్తులు పూలజల్లులు కురిపించారు. పసుమర్తి వెంకట శివనాగమల్లేశ్వరరావు, శ్రీలక్ష్మి, బొగ్గవరపు కృష్ణప్రసాద్, భాగ్యలక్ష్మిల సహకారంతో తెప్పోత్సవం జరిపించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్‌ఐ ఎ.బాలకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ప్రభుత్వ భూములను పరిశీలించిన జేసీ


వడ్లమూడిలో భూమిని పరిశీలిస్తున్న జేసీ రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి, నారాకోడూరు గ్రామాల్లోని ప్రభుత్వ భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి బుధవారం పరిశీలించారు. వడ్లమూడి గ్రామంలోని సర్వే నెంబరు 310–2బిలోని 40.43 సెంట్ల ప్రభుత్వ పోరంబోకు భూమిని, నారాకోడూరు గ్రామ సర్వే నెంబరు 173–2లోని 7.36 ఎకరాల భూమిని మరియు సర్వే నెంబరు 365లోని 13.35 సెంట్ల భూమిని జాయింట్ కలెక్టర్ రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. వడ్లమూడి గ్రామ సర్వే నెంబర్లో ఎంఎస్‌ఎంఈ, పార్క్, ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల ఏర్పాటు కొరకు భూ పరిశీలన జరిగింది. నారాకోడూరు గ్రామంలో దేవాదాయశాఖ నుంచి సేకరించిన భూమి పేద ప్రజలకు ఇచ్చే ఇళ్ల స్థలములు మంజూరు విషయమై కోర్టు పరిధిలో ఉన్న అంశంను మరియు ప్రత్యామ్నాయంగా అదే గ్రామంలో గల కుంట పోరంబోకు భూమిని సైతంను అధికారుల బృందం పరిశీలించారు.

వైద్య చరిత్రలో జగనన్న సురక్ష నూతన అధ్యాయం

కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

గుంటూరు వెస్ట్: పేద ప్రజల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక నూతన పథకాలు ప్రవేశ పెడుతోందని, దీనిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం అద్భుతమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఐపీడీ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. శిబిరంలో రిజిస్ట్రేషన్ కౌంటర్, డాక్టర్ కన్సల్టెన్సీ గదులు, ల్యాబ్, మందులు పంపిణీ చేసే విధానం, కంటి పరీక్షల విధానాలు పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబరు 30 నుంచి జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రారంభమైందన్నారు.

ఇప్పటి వరకు 14,89,582 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో ఈ శిబిరాల్లో గ్రామీణ ప్రాంతాల్లో 193, పట్టణ ప్రాంతాల్లో 74 మొత్తం 267 శిబిరాలు నిర్వహించగా, వీటిలో 1,05,034 మంది వైద్య సేవలు పొందారన్నారు. దాదాపు 3,870 మందికి తదుపరి స్థాయి వైద్య పరీక్షలు రిఫర్ చేశామన్నారు. వీరందరికీ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. బీపీ, షుగర్ పరీక్షలతోపాటు, మహిళలకు రక్త పరీక్షలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. జ్వర లక్షణాలు ఉన్న వారికి డెంగీ, మలేరియా పరీక్షలు నిర్వహించామన్నారు. క్యాంపుల్లో స్పెషలిస్టు వైద్యులతో మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు, కంటి పరీక్షలు కూడా నిర్వహిస్తుండటంతో ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందన్నారు. ముఖ్యంగా సిబ్బంది, వైద్యులు, ప్రజలతో మమేకమవుతున్న తీరు చాలా బాగుందని పేర్కొన్నారు. నవంబరు 10 నాటికి మరికొన్ని వైద్య శిబిరాలు ప్రారంభిస్తామని కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీపీఎం డాక్టర్ చుక్కా రత్న మన్మోహన్, వైఎస్సార్ సీపీ నాయకులు నూరిఫాతిమా, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబాలకు ధైర్యం

అన్నివేళల్లో పోలీస్‌శాఖ అండ ఉంటుందంటూ ఉన్నతాధికారుల హామీ


గౌరీశంకర్ కుటుంబ సభ్యులకు బహుమతి అందిస్తున్న డీఎస్పీ, సీఐ


కానిస్టేబుల్ విగ్రహానికి నివాళులు

నగరంపాలెం: పోలీసు అమరవీరుల దినోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అమరవీరుల వారోత్సవాలు జరుగుతున్నాయి. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్నారు. దీనిలో భాగంగా సబ్ డివిజన్ పరిధిలో ఉంటున్న పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెబుతున్నారు. డీఎస్పీ స్థాయి అధికారి నుంచి సీఐలు, ఎస్‌ఐలు పోలీస్ సిబ్బంది బుధవారం వారి ఇళ్లకు వెళ్లారు. ఇంటి పెద్ద దిక్కు ప్రాణం కోల్పోయిన పరిస్థితులపై వాకబు చేశారు. ప్రస్తుతం ఆయా కుటుంబాల్లోని పిల్లలు ఏం చదువుతున్నారు, కుటుంబ ఆర్థిక పరిస్థితులపై ఆరాతీశారు. అనంతరం వారికి మరింత మనో ధైర్యం అందించారు. భవిష్యత్‌లో కుటుంబ సభ్యులకు ఎటువంటి సహాయ సహకారాలు అవసరమైనా జిల్లా పోలీస్ శాఖ అండగా / తోడుగా ఉంటుందని భరోసా కల్పించారు. పిల్లలను ఉన్నతంగా చదివించి, గొప్ప ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని పోలీస్ అధికారులు ఆకాంక్షించారు. వట్టిచెరుకూరు మండలం కాట్రపాడులోని కానిస్టేబుల్ గౌరీశంకర్ విగ్రహానికి దక్షిణ డీఎస్పీ మహబూబ్ బాషా, ప్రత్తిపాడు పీఎస్ సీఐ ఎంవీ సుబ్బారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామస్తులకు మిఠాయిలు పంపిణీ చేయగా, గౌరీశంకర్ కుటుంబ సభ్యులకు బహుమతి అందించారు. నగరంపాలెం పీఎస్ పరిధిలోని అమరులైన ఓ పోలీస్ కుటుంబాన్ని ఎస్‌ఐ రోజాలత సందర్శించి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

సమకాలీన సాంఘిక పద్యనాటకాలు అవసరం

- సినీ రచయిత సాయిమాధవ్
- బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారం ప్రదానం


పొన్నవోలు రామసుబ్బారెడ్డికి బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి పురస్కారం ప్రదానం

తెనాలి: నేటి సమకాలీన సాంఘిక పద్యనాటకాల రచనకు నాటక రచయితలు పూనుకోవాలని, వచ్చే ఏడాది ఆ విభాగంలో పరిషత్ పోటీలను నిర్వహించనున్నట్లు ప్రముఖ సినీరచయిత, కళల కాణాచి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ సాయిమాధవ్ బుర్రా ప్రకటించారు. కళల కాణాచి– తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్– విజయవాడ సంయుక్తంగా స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో ఐదురోజులు పాటు నిర్వహించిన వీణా అవార్డ్స్–2023 తృతీయ జాతీయ స్థాయి పద్యనాటక/సాంఘిక నాటికల పోటీల ముగింపు సభ మంగళవారం రాత్రి నిర్వహించారు. తెనాలికి చెందిన ప్రఖ్యాత రంగస్థల నటుడు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాన్ని నెల్లూరుకు చెందిన ప్రముఖ నటుడు, దర్శకుడు, గుణనిర్ణేత పొన్నాల రామసుబ్బారెడ్డికి ప్రదానం చేశారు. రూ.25 వేల నగదు, సన్మానపత్రం, జ్ఞాపికను రామసుబ్బారెడ్డి దంపతులకు బహూకరించి సత్కరించారు. సాయిమాధవ్ మాట్లాడుతూ ప్రదర్శన పారితోషికానికి అదనంగా ఒక్కో రచనకు రూ.25 వేలు అందజేయనున్నట్లు వెల్లడించారు. సభకు ప్రముఖ నాటక రంగ విశ్లేషకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. అవార్డు గ్రహీత పొన్నవోలు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏ మహానుభావుడి వల్ల నాటకరంగంలో ఉన్నతికి చేరుకున్నానో ఆ మహనీయుడు సుబ్రహ్మణ్యశాస్త్రి పురస్కారాన్ని అందుకోవటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ జ్యోతిష్య పండితుడు ప్రదీప్ జోషి, ఆర్ఎస్ఆర్ గ్రూప్స్ అధినేత శ్రీకాంత్‌రెడ్డి, సినీదర్శకులు వంశీ, రాజా వెన్నంరెడ్డి, సినీహీరో అశోక్ గల్లా, వీజీకే అండ్ వీవీఎల్ ఫౌండేషన్ కోశాధికారి తుమ్మల కిషోర్‌కుమార్, సినీనిర్మాత సోమినేని బాలకృష్ణ, సినీనటుడు ప్రదీప్, రంగస్థల నటి బుర్రా జయలక్ష్మి పాల్గొన్నారు. వేదగంగోత్రి డాక్టర్ వరప్రసాద్, కళల కాణాచి గౌరవ సలహాదారులు గోగినేని కేశవరావు, వేమూరి విజయభాస్కర్, వ్యవస్థాపక కార్యదర్శి షేక్ జానీబాషా, ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, కోశాధికారి దేవరపల్లి భవాని, సహాయ కార్యదర్శులు గోపరాజు విజయ్, కొండముది రమేష్ పర్యవేక్షించారు.

అనుమతి లేకుండా రాజకీయ ప్రచారాలు చేయొద్దు

- ట్రావెల్స్, డీజేల నిర్వాహకులు పోలీసుల అనుమతులు ఉంటేనే వెళ్లాలి
- రాజకీయ ప్రచారాలకు, ఊరేగింపులకు బాణాసంచా విక్రయాలు చేయరాదు
- సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ


మాట్లాడుతున్న డీఎస్పీ ఆదినారాయణ, పక్కన సీఐలు

సత్తెనపల్లి: జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఏ రాజకీయ పార్టీ అయినా సరే ముందస్తు అనుమతి లేకుండా రాజకీయ ప్రచారాలు, సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదని సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ చెప్పారు. పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహిస్తే 30 పోలీస్ యాక్ట్‌ను ధిక్కరించినట్లేనని, ఇది ప్రజాశాంతికి భంగం కలిగించినట్లు అన్నారు. అన్ని రాజకీయపార్టీలు ముందస్తుగా అనుమతులు పొంది రాజకీయ ప్రచారాలు, సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించుకోవాలన్నారు. అనుమతి పొందిన రాజకీయపార్టీల నాయకులు తమ రాజకీయ ప్రచారాలు, సభలు, సమావేశాలు, ఊరేగింపుల సమయంలో ఏ విధమైన బాణాసంచా పేల్చడానికి అనుమతిలేదన్నారు. ముఖ్యంగా డీజేల నిర్వాహకులు రాజకీయపార్టీల నాయకులు పిలవగానే పోలీసుల అనుమతి ఉందో లేదో తెలుసుకోవాలన్నారు. సబ్ డివిజన్‌లో నేరాల నియంత్రణకు ప్రజలందరూ సహకరించాలని డీఎస్పీ ఆదినారాయణ కోరారు. సమావేశంలో సత్తెనపల్లి రూరల్ సీఐ పి.ప్రేమయ్య, పెదకూరపాడు సీఐ కె.వీరాస్వామి, అమరావతి సీఐ ఏవీ బ్రహ్మం, నకరికల్లు ఎస్‌ఐ బాలకృష్ణ, తదితరులు ఉన్నారు.